# నిరాశ

శ్రీ గోష్టి బాబూరావు

★

నాకు అప్పటికి పెళ్ళిఅయి సంవత్సరం అవుతుంది. అయిన కొలది మాసాలకే రేడియో ఇంజనీరింగు చదువటానికి పట్నం వెళ్లాను. నేను పట్నంవెళ్లుట అదే మొదటిసారి కనుక నాచిత్తంవచ్చినట్లు ఊరంతా తిరిగాను. ఇట్లా కొన్నిరోజులు జరుగుచుండగ ఒకనాడు బీచి ఒడ్డున కూర్చొని స్నేహితులతోటి బాతాఖాని కొట్టుచుండగ మాటల సందర్భమున మాసుబ్బులు జ్ఞాపకమువచ్చి ఆమెను చూడవలెనని బుద్ధిపుట్టింది. కాని ఏమిలాభము. పిలవని పేరంటానికి వెళ్లకూడదు. ఈ విషయంతోటి నాబుర్ర చెడిపోయింది. ఇంక అచ్చట కూర్చోలేక లాడ్జింగుకు వచ్చేశాను. ఆరాత్రి ఆకలిలేక పోయినా భోంచేసి వందేమాతరం సినిమాకు వెడదామని బయలుదేరాను. సినిమాలోకూడ మా సుబ్బులే జ్ఞాపకం వచ్చింది మరి అక్కడకూడ కూర్చోలేక లాడ్జింగుకు వచ్చేశాను. ఆరాత్రి నిద్రపట్టలేదు. ఊహా సముద్రములో మునుగుచూ తేలుచూ నుండగ తెల్లవారింది. ఇక మనస్సు స్థిమితపడలేదు. రూమ్‌లో ఇటూ అటూ పచారు చేస్తూండగ పోష్టుజవాను వచ్చి కవరు ఒకటి ఇచ్చాడు. ఎక్కువ ఆత్రుతతో దానిని చింపి చూశాను. ఇంక నాసంతోషానికి పట్టపగ్గాలు లేవు. ఆ ఉత్తరంలో సంక్రాంతి పండుగకు రమ్మని మామావగారు వ్రాసారు. ఆరోజునే నాసూట్‌కేస్ సర్దుకొని ఆరాత్రి బండికి బయలుదేరి, మా స్వగ్రామం చేరాను, నేనింటికి వచ్చుసరికి పిల్లలంతా నాచుట్టూ మూగారు. మా ఆఖరి మేనల్లుడు శేషు నాకు బొమ్మలు తెచ్చావా అంటూ ఒక్కసారిగా నామీదకు ఉరికాడు, మా పెద్ద మేనకోడలు వెటకారంగా మావయ్యా లోలకులు తెచ్చాడంటూ పిల్లరిని మరింత రెచ్చగొట్టసాగింది. ఈగందరగోళము అంతా పదిహేను నిమషాలలో పూర్తి అయింది అంతట్లోనే మానాన్న పొలంనుంచి వచ్చాడు. నన్నుచూచి ఒంట్లో కులాసాగా వుంటోందిరా బాబూ అని అంటూ ప్రొద్దుపోయింది భోజనానికి లెమ్మన్నాడు. నేను లోపలకు వెళ్ళి మావదినను పలకరించి భోజనానికి లేచాను. మావదిన వెటకారంగా రావుగారు రేపు అత్తారింటికి వెడతారు కామోసు అంది. నేను తెలియనిలా అత్తారింటికి ఎందుకు పండుగపూటా ఇక్కడ వుండకుండా. అని భోజనము పూర్తిచేసి సావిట్లోకి వచ్చేశాను. మానాన్న కుర్చీలో కూర్చొని ఏదో విషయము ఆలోచిస్తున్నాడు. నేనుకూడ వారి ప్రక్కనే కుర్చీ వేసికొని కొంతసేపు రాజకీయ వ్యవహారములు మాట్లాడుచుండగ మానాన్న మాటల సందర్భములో నన్ను మాఅత్తవారు రమ్మని ఉత్తరం వ్రాశారని చెప్పాడు. సరేనని వెళ్ళి పడుకొన్నాను.

మర్నాడు ప్రొద్దున పదిగంటల బండికి మాఅత్తవారివూరు బయలుదేరాను. నేను రైలుదిగు సరికి మా మావగారు, మాబావమరిది అగు భాను గేటుదగ్గర వున్నట్టు చూశాను. మాభాను నన్నుచూచి అదుగో బావయని ఒక్క కేకవేశాడు. నేను టిక్కట్టు ఇచ్చి ఇవతలకు వచ్చి బండి మాట్లాడి ముగ్గురు ఇంటికి వచ్చాము. బండి ఆగి ఆగడంతోనే మాభాను దిగి సుబ్బులక్కయ్యా! బావ వచ్చాడు అని ఒక్క కేక వేశాడు. మా ఆవిడకు లోపల సంతోషం వున్నా వానిని ఒక్కసారి గదమాయించింది. ఆరాత్రి భోజనము దగ్గర నన్ను శతప్రశ్నలు వేశారు వాటికి సరియైన జవాబులిచ్చి భోజనము అరగంటలో పూర్తిచేశాము. సావిట్లోనికి వచ్చుసరికి మాసుబ్బులు పక్కలు వేస్తోంది. నేను నెమ్మదిగ ఇక్కడ పడుకోను ఆరుబైట పడుకుంటాను అన్నాను. నామాట విన్నదో లేదో సింహమునకు బెదరి పారిపోయిన జింకపిల్లవలె లోనికి పారిపోయింది. అంతలోకే మావగారు నీచదువులు ఎల్లా వున్నాయి రావూ అంటూ సావిట్లోనికి వచ్చారు. వారికి తగిన సమాధానం చెప్పి మంచంమీద నున్న తమలపాకులు చూశాను. ఇవి నాకొరకు అవును కాదో అంటూ ప్రక్కగది వైపుకు చూశాను. గదిలోనుంచి మాసుబ్బులు భావయుక్తమైన ప్రేమతో నాకేసి చూసింది. తక్షణమే మరేమీ ఆలోచించక తమలపాకులు వేసికొని మరల గదివైపుకు చూశాను. కాని నామనస్సు ఒక్కసారి చివుక్కుమంది. ఇంక ఆరాత్రి నిదుర పట్టలేదు. నేను పట్నంనుంచి ఎంతో ఆశతో వచ్చానో అంత నిరాశ కనపడుతోంది. నేను ఆమెను ఎన్నిసార్లు పలుకరించినా మౌనముతో నుండెను. దానికి కారణము సిగ్గులేక వారి తలిదండ్రులు తిడుదురేమో యని భయమో సరియైన సంగతి తెలియదు.

తెల్లవారిన తరువాత కాలకృత్యాలు తీర్చుకొని కాఫీ పుచ్చుకొని సావిట్లో పేపరు చదువుతూ కూర్చున్నాను. ఇంతలో మాబావగారు కూలివానిచే బట్టలు మూట పట్టించుకొని లోపలికి ప్రవేశించారు. ఇవి పండుగ కానుకలు కాబోలు అని నేను అనుకొన్నాను. నామనస్సేమీ సుఖముగ లేదు. కారణ మేమంటే నేను పండుగ కానుకకోసం రాలేదు. పిండివంటల భోజనానికి రాలేదు. వారు మర్యాదకొరకు పిల్చారని కాని రాలేదు. నాప్రియకోమలి అను సుబ్బులుతో కాలక్షేపము చేద్దామని వచ్చాను. కాని ఆమె మాత్రము నన్నట్లు తృప్తిపరచుటలేదు. నాకు ఆమెయెడల అంత ఎక్కువ ప్రేమ యుండుటకు కారణము లేకపోలేదు. మేము ఒకరి నొకరు ప్రేమించి చేసికొన్న వివాహము ఆప్రేమే నన్ను పట్నంనుండి తీసికొన రాగల్గింది. ఈ రోజులలో స్త్రీ పురుషులకుండు నిష్కల్మషమైన ప్రేమ దేశమును ఉన్నత దశకు తీసికొని రాగల్గును కాని కల్మషమైన ప్రేమ ఎంతమాత్రము తీసికొని రాదు.

నేను నానిరాశను తలపోసుకుంటూ మరుచటి రోజుననే ప్రయాణము స్థిరపరచుకొన్నాను. నామనస్సులోనున్న తలంపును చేష్టలుబట్టి ఇంట్లోవారంతా గ్రహించారు. మాభాను నాదగ్గరకువచ్చి రహస్యంగా మాఅక్కయ్య నాలుగురోజులు ఉండమంటోందోయి బావా అన్నాడు. నాకంతటి అదృష్టమా యనుకొని నాకు సెలవులేదోయి అని నిరుత్సాహంతో జవాబిచ్చాను. ఈమాటలువిని మాసుబ్బులు చిన్నపుచ్చుకొన్నదని గ్రహించాను.

మరుచటి రోజున మధ్యాహ్నము బయలుదేరుతాననగా ప్రొద్దుననే ఫలహారములు తయారుచేసి నన్ను ఆహ్వానించారు. ఫలహారము దోరగావేసిన దోసెలు కమ్మగానున్న కాఫీ ఆసమయమున నన్ను ఆనంద పరచాయి. మధ్యాహ్నము రైలు టైము అయింది. సామాను బండిలో వేయమని నానిరాశను బండివాని మీద చూపాను. మామావగారు సంవత్సరాదికి ఉత్తరం రాస్తాను రావోయి అన్నారు. కాని నాకు వచ్చుటకు వీలులేదన్న భావము నామనస్సే వారికి రహస్యముగా తెల్పినదైనది. బండి కదలింది. మాసుబ్బులు సావిట్లో కిటికీ దగ్గర నిలబడి అశ్రుధారలు వదలినట్లు నాకు గోచరించినది. సూర్యుడు ఆకాశ మధ్యమునుండి నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. కాని నిప్పు కణములు, నానిరాశ ఏకమై నన్ను మరింత కలవరపెట్ట సాగింది. కనుపడు బాధకు భరించలేక మాబుస్సులు నిరుత్సాహంలో లోనికి వెళ్ళిపోయింది. నేను, మామావగారు, భానూ, కలసి స్టేషనుకు చేరుకొన్నాము. నేను టిక్కెట్టు తీసికొని రైలు ఎక్కాను. రైలు కదలింది వెళ్ళగానే వుత్తరం వ్రాయి వోయి రావూ అంటూ మామావగారు హెచ్చరించారు. మాభాను గుడ్ బై చూపి ఇద్దరూ వెళ్ళిపోయారు. నానిరాశను తలచుకొంటూ రైలులో ఒకనిద్ర తీశాను.

## 'కథాంజలి'

~

### కథకులకు మనవి

~

పోయిన సంవత్సరం జూన్ నెలలో కథాంజలి వార్షికసంచిక వెలువడింది. ఈ సంవత్సరం కూడా జూన్ నెలలో "కథాంజలి వార్షికసంచిక" వేయాలనుకున్నాము. సంచిక 68 పుటలతో ప్రత్యేక ఆకర్షణలతో వుంటుంది. కథకులు తమ అమూల్య కథల్ని వచ్చేనెల మే 20 వ తేదీలోగా మా కార్యాలయానికి పంపిస్తే కృతజ్ఞతతో అందుకుంటాం. కథలు 3, 4 పుటలకు మించకుండా వుండాలని కోరుతున్నాం. కథకులు అందరికి ప్రత్యేకంగా వ్రాయడానికి వ్యవధిలేనందున యీపత్రికద్వారా కథకుల సహకారాన్ని ఆసిస్తున్నాము.

—ఎడిటర్ "కథాంజలి"

జి. టి. మదరాసు.